# దొంగనోట్లు

"ఏమండీ ఏదైనా పనిమీద ఉన్నారా?"

గుమ్మంలో, నిలబడిన అపరిచిత వ్యక్తిని చూచి వెంకటరామయ్య కుర్చీలోనుంచి చప్పున లేచి, దర్జాకోపం పెట్టుకొన్న కళ్ళజోడు సర్దుకొని గుమ్మంవైపు తిరిగి "రండి-తమరు..." అని ఆగాడు.

ఆ వ్యక్తి నెమ్మదిగా గుమ్మం ఇవతలకు వచ్చి "నా పేరు రంగారావండీ. తమ పరిచయం చేసు కొందామనే వచ్చాను. అయితే మీరు ఆ చలపతిరావుగారు ఉమ్మడిగా వ్యాపారం చేస్తున్నారనీ, మీరు నమ్మదగిన వారనీ విన్నాను. గత రెండు రోజులుగా నేనూ ఇక్కడే బసచేస్తున్నాను. కాని ఇలా రావడానికి వ్యవధి లేకపోయింది. ఇప్పటికి మీ పరిచయం కలిగించుకో గలిగినందుకు సంతోషంగా ఉన్నది" అన్నాడు.

ఆయన మాటల ధోరణిలో హుందాతనం; మంచితనం కలుపుగోలుతనం కన్పించాయి. వెంకటరామయ్యకు ఆయన్ను చూడగానే సదభిప్రాయం కలిగింది. "నమస్కారం. రండి వచ్చి ఇలా కూర్చోండి. మీవంటి పెద్దలతో ఇలా పరిచయం కలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను." అన్నాడు వెంకటరామయ్య.

రంగారావు లోపలకు వచ్చి బంగారపు ఫ్రేములో అందంగా ఆకర్షణీయంగా కన్పిస్తున్న సులోచనాలు తీసి పంచకొంగుతో తుడిచి బల్లమీద పెట్టాడు వంకులు తిరిగిన పెద్దక్రాపు సర్దుకొన్నాడు. ఆయన కట్టుకొన్నది

పెద్దాపురం వస్త్రాలు. అన్నివేళ్ళకూ విలువైన రాళ్ళు పొదిగిన ఉంగరాలున్నాయి. చేతికి చాలా ఖరీదైన గడియారం ఉన్నది. ఆయన వెంట తెచ్చిన తోలు సంచీకూడా ఖరీదైనదీ- సరి క్రొత్త నమూనాదీ. ఆయన్ను చూచి గొప్ప ధనవంతుడే అయి వుంటాడు అనుకొన్నాడు వెంకటరామయ్య.

రంగారావు వ్యాపారంగురించి చాలా వివరంగా మాటాడాడు. దేశంలో ప్రయివేటు రంగంతో వాణిజ్యాభివృద్ధికి కల అవకాశాలను గురించీ, విదేశీ వాణిజ్యానికి పూనుకోవలసిన అ వ స రం గు రిం చీ ప్రస్తావించాడు. కొన్ని నిముషాల తర్వాత వెంకటరామయ్య చేస్తున్న వ్యాపారం త్వరలో బాగా లాభసాటిగా రూపొందడానికి తీసుకోవలసిన చర్యల విషయమై సలహాలు ఇచ్చాడు చేస్తున్న వ్యాపారం శీఘ్రంగా పెద్ద ఎత్తున విస్తరింపజేయడానికి అనువైన మార్గాలు సూచించాడు. ఆ సందర్భంగా తన వ్యాపారానుభవం గురించి కూడా తెలియజేశాడు.

ఈయన పెద్ద వ్యాపారస్తుడు కూడానూ అనుకొన్నాడు వెంకటరామయ్య. అలా అనుకొంటూ ఆయన "ఇంతకు తమరు ప్రస్తుతం.... అని అడిగాడు. అందుకు రంగారావు వెంటనే అందుకొని "వ్యాపారాలు చాలా ఉన్నాయి, అవన్నీ భాగస్వాములతో కలిసి చేస్తూనే ఉన్నాను. కొన్ని కంపెనీలలో వాటాలు కొన్నాను. అన్నింటిలోనూ లాభాలు వస్తున్నాయి. అయితే అవికాక" అని ఆగి గుమ్మం వంక చూచాడు. కొన్ని క్షణాల తర్వాత అతను నెమ్మదిగా వెళ్ళి ఆ గది తలుపు గడియవేసి తిరిగివచ్చి కుర్చీలో కూర్చుంటూ అప్పటిదాకా అతని కాళ్ళ దగ్గర ఉన్న తోలు సంచీ తీసి ఒడిలో పెట్టుకొని రహస్యంగా అంటున్నట్లు "మీ మీద నాకు నమ్మకం కలిగింది. అందువల్ల ఇతర వ్యాపారాలన్నీ అలా ఉంచి నేను విడిగా నిర్వహిస్తున్న మరో వ్యవహారం గురించి చెప్తాను. ఇంతా మన

మధ్య దాపరికం ఎందుకూ" అని ఒక్క క్షణం ఆగాడు. వెంకటరామయ్య సంతోషం వ్యక్తం చేస్తూ, "చెప్పండి" అన్నాడు. రంగారావు వెంటనే తోలు సంచీ తెరిచి నోట్ల కట్టలు బయటకు తీశాడు. అతను పదిహేను కట్టలు ఒకదాని ప్రక్కన మరొకటి బల్లమీద పరిచాడు.

"రండి. చూడండి" అన్నాడు. అతను కొంచెం పెద్దగా. వెంకటరామయ్య దగ్గరకు వెళ్ళి కళ్ళు పెద్దవి చేసుకొని చూచాడు. అవన్నీ పది రూపాయల నోట్లు. అన్నీ సరిక్రొత్తవి. అవి చూడగానే ఆయనకు మొదట బెదురు పుట్టింది. అది గమనించి రంగారావు చిరునవ్వు నవ్వుతూ "మీరు జంకకండి. ఇటువంటి వ్యవహారాలు మనబోటి వాళ్ళు చేస్తే ఏ చిక్కూ రాదు. మనకిది చిన్న సైడ్ బిజినెస్‌గా మాత్రమే ఉంటుంది. మీకు సంకోచం అక్కర్లేదు. నేను మీకు పూర్తిగా మద్దతు ఇస్తాను. ముందు మీరుకొన్ని చూడండి" అన్నాడు. అలా అంటూనే అతను ఆ కట్టలలోనుంచి ఇక్కడొకటీ అక్కడొకటీ చటుక్కున లాగి అయిదు నోట్లు వెంకటరామయ్య చేతికి ఇచ్చాడు. ఆయన వాటిని జాగ్రత్తగా పరిశీలించాడు. జేబులో పర్సుతీసి అందులో కొంచెం క్రొత్తగా ఉన్న పది రూపాయల నోటు ఎంచుకొని దానితో, వాటిని పోల్చి చూచాడు. లైటువేసి ఆ విద్యుద్దీపానికి క్రిందుగా ఎత్తిపెట్టి మరింత పరిశీలనగా చూచాడు. ఎక్కడా తేడా కన్పించలేదు. అవి అచ్చంగా తనదగ్గర ఉన్న నోటులాగానే ఉన్నాయి.

రంగారావు నెమ్మదిగా, కాని స్పష్టంగా "పదులు అయిదులు క్రింద ఇస్తాను. ముందు మీరవి మార్చుకొని చూడండి ఆ తర్వాత వ్యవహారం చూద్దాం" అన్నాడు. ఆయన వెంటనే రెండు పదులూ, ఒక ఐదు తీసి అతని చేతికి ఇచ్చాడు. అతను అవి తీసుకొని నిర్లక్ష్యంగా లాల్చీ జేబులో కుక్కుకొన్నాడు. చేతిసంచీ ఊపుకొంటూ "ఒకసారి నాగరికి వెళ్ళి వస్తాను. బజార్లో అవి మార్చుకొందురుగాని" అన్నాడు.

పది నిముషాల తర్వాత వెంకటరామయ్య గదికి తాళంవేసి, వీధిలోకి వచ్చి నిలబడ్డాడు ఆయనకు భయంవేసింది. మళ్ళీ గదికి వెళ్ళిపోదామా అనిపించింది. వెనుతిరిగి అటు అడుగు వెయ్యబోతుండగా రంగారావు గబగబా ముందకు వచ్చి "పదండి, మీకు తోడు ఉంటాను. ఎక్కడయినా ఇబ్బంది వస్తేనన్నుచూపించి, మీరు తప్పుకొని వెళ్ళండి సరేనా...." అన్నాడు.

వారు ఇద్దరూ రిక్షాలో పెద్ద హోటలుకు వెళ్ళారు. అవీ ఇవీ తిని కాఫీ తాగిగాక బిల్లు తీసుకొని కౌంటరు దగ్గరకు వెళ్ళారు. 'రద్దీగా లేదే యిప్పుడీ నోటు మార్చడం మంచిదేనా' అని వెంకటరామయ్య సంకోచిస్తుంటే రంగారావు ముందుకు వెళుతూ "సరే. మీరే ఇవ్వండి నా దగ్గరా చిల్లరలేదు" పెద్దగా అని పర్వాలేదు ఇవ్వొచ్చు అంటున్నట్లు కళ్లతో, చేతితో సంజ్ఞచేశాడు.

ఆయన జేబులోంచి క్రొత్త నోటు తీసిఇచ్చాడు. అలా ఇస్తున్నప్పుడు ఆయన చేయి వణికింది కౌంటరులో ఉన్న వ్యక్తి నోటు తీసుకొని అలా ఒకసారి చూచి సొరుగులో పడేసి చిల్లర ఎనిమిది రూపాయలు ఇచ్చాడు. అది తీసుకొని వెంకటరామయ్య మరికొన్ని క్షణాలు కావాలని ఆలస్యం చేసి, నెమ్మదిగా బయటకు వెళ్ళాడు

వీధిలో కిళ్లీ, సిగరెట్టు అందిస్తూ, ఏమండీ అనుమానం తీరిందా మరి పదండి. మిగతావి మరోచోట మార్చుకొందాం, అన్నాడు రంగారావు ఆయన వెంట ముందుకు నడుస్తూ.

పెద్దబజారులో దుకాణలలో చిన్నచిన్న వస్తువులు కొన్నాడు వెంకటరామయ్య పావుగంటలో ఆయన తెచ్చిన ఆ ఐదు కొత్త నోట్లు సులభంగా చెల్లిపోయాయి. వాటి విషయంలో ఎక్కడా ఏవిధమైన ఆక్షేపణా రాలేదు. వారు రిక్షాలో తిరిగి బసకు చేరుకొన్నారు.

ఆయన రంగారావును గౌరవంగా సాదరంగా తన గదిలోకి తీసుకొని వెళ్లాడు. అతను లోపలకు వస్తూనే తలుపు గడియవేశాడు. అతను కుర్చీలో కూర్చోగానే “మరి నాకు ఎంతివి ఇస్తారు?” అన్నాడు వెంకటరామయ్య నెమ్మదిగా.

“మరీ ఎక్కువ ఇవ్వన్లెండి”

“అదేం అలా అనేశారు? నా దగ్గర ఆమాత్రం డబ్బు లేదనుకొన్నారా”

“అబ్బే అదికాదు. భయస్తులులా కన్పిస్తున్నారు. కాని చూశారా సాహసే లక్ష్మి అన్నారు.”

“నిజమే. కాని ఇల్లాంటి వ్యవహారాలలో ప్రారంభంలో ఎవరికైనా భయం కదండీ.”

“అదుగో ఆ మాటే అనవద్దు అంటున్నా. మన సొమ్ము మార్చుకోడానికి భయం దేనికి? వీళ్ళు నీకంటే, నాకంటే తెలివి కలవాళ్లా, అయితే విషయం వచ్చింది కనుక చెబుతున్నా. ఈనోట్లు ఏ బ్యాంకులో ఇచ్చినా తీసుకొంటారు.

“ఆ ఆ ఏమన్నారూ? బ్యాంకు లోనా! ఇవి బ్యాంకులో ఇవ్వచ్చునంటారా?”

“లక్షణంగా”

“నాకు నమ్మకంలేదు” అన్నాడు వెంకటరామయ్య. అలా అని అయన నాలుక కరుచుకొన్నాడు. ఆ ఏదో, నాకు నమ్మకం కలిగేందుకు ఇలా అంటున్నాడులే అనుకొంటూ ఆ మాటే పైకి అనేసి, మరుక్షణంలో ‘అయ్యో అలా ఎందుకు అన్నానా?’ అని బాధపడ్డాడాయన.

రంగారావు చప్పున లేచి నిలబడి “మనం ఒక పనిచేద్దాం. ఇక్కడ మీకో వెయ్యిఇస్తాను. బ్యాంకుకు వెళదాం. అక్కడ ఎకౌంట్ నెంబరు

చెబుతాను డబ్బు జమకట్టండి. మనకు కావలసింది ఇవి వాళ్లు తీసుకొంటారో లేదో చూడడమేగా? అన్నాడు.

వెంటనే వారు ఇద్దరూ టాక్సీలో, బ్యాంకుకు వెళ్ళారు.

డబ్బు కడుతున్నంతసేపూ రంగారావు ఆయనకు రెండడుగుల దూరంలో నిలబడ్డాడు. వెంకటరామయ్య ఆ పది నిముషాలూ నిలువునా వణికిపోయాడు. ఆ షరాబు ఆ నోట్లకట్టలు విప్పి ఒకటి తీసి, రెండు ఒక్క క్షణం అలా పరీక్షించి మరుక్షణంలో, గబగబా లెక్కపెట్టడం మొదలుపెట్టాడు. అదంతా చూడనట్లు నటిస్తూ, జాగ్రత్తగా గమనించాడాయన. పెద్ద ప్రమాదం వచ్చి పడుతుందనీ, ఆ నేరం రంగారావుమీదకు నెట్టి చూడండి నామాట అబద్ధం అయితే అతని సంచీలో, "ఇలాంటి క్రొత్త నోట్లు" ఇంకా ఎన్ని ఉన్నాయో అని చెప్పి అతన్ని అప్పగించి తాను తప్పుకొందామని అనుకొన్నాడాయన అలా అనుకొంటూ ఒకసారి రంగారావువంకా, మరోసారి షరాబువంకా చూస్తూ, అయిదు నిముషాలు అతికష్టంగా గడిపాడాయన. ఆ షరాబు ఆ నోట్లకట్టలు సొరుగులో పడేసి, తాళంవేసి, రసీదు చేతికి ఇచ్చినతర్వాతకూడా ఆయన ఒకటి రెండు నిముషాలదాకా అక్కడే నిలబడ్డాడు.

పదిహేను నిముషాల తర్వాత టాక్సీ దిగుతూ వెంకటరామయ్య "కిరాయి నన్ను ఇవ్వనీయండి" అన్నాడు. అందుకు రంగారావు వెంటనే "అబ్బే అది ధర్మం కాదు ఇప్పుడు వెళ్ళి వచ్చింది నావని మీద, పైగా అది కేవలం వేరే వ్యాపారం." కనుక నేను ఇవ్వడం న్యాయం. అయితే ఇవ్వడం మీరే ఇవ్వండి. కాని ఇదుగో ఇవికాస్త వ్యయం అయ్యే ఉపాయం చూడండి అన్నాడు. అలా అంటూ అతను సంచీ తెరిచి, పది రూపాయల నోటు తీసి ఇచ్చాడు వెంకటరామయ్య అది తీసుకొని టాక్సీవాడి చేతికి

ఇచ్చి "మరి చిల్లర ఉన్నదా?" అన్నాడు. టాక్సీడ్రైవరు నవ్వుతూ మూడున్నర అయింది. టిప్ కలుపుకొంటే నాలుగయింది. ఆరున్నాయి కాదంటే వెళ్ళి రూపాయి మార్చి ఆ అర్ధాకూడా ఇచ్చేస్తాను" అన్నాడు.

"అక్కర్లేదులే ఇవ్వు" అన్నాడు వెంకటరామయ్య. అతను ఆ నోటు జాగ్రత్తగా రెండువైపులా త్రిప్పిచూచి జేబులో పెట్టుకొని, ఆరురూపాయలు తిరిగి ఇచ్చి నమస్కారం చేశాడు.

"వెంకటరామయ్య తన గదిలో అడుగు పెడుతూనే" అయ్యా మీకు అనవసరంగా శ్రమకలిగించాను. క్షమించండి. మరినాకు ఒక్కరెండువేలవి ఇవ్వండి "అన్నాడు."

రంగారావు సంచిలోనుంచి నాలుగు కట్టలు తీసి ఆయన చేతికి ఇస్తూ "ఇవిగో నాలుగువేలు అయితే మీరు ఇవ్వవలసింది రెండు మాత్రమే" అన్నాడు నవ్వుతూ.

వెంకటరామయ్య "అవును మరి రెండేగా" అంటూ తనూ కావాలని నవ్వుతూ అవి తీసుకొని మంచంమీద కూర్చుని, కట్టలు విప్పి జాగ్రత్తగా లెక్కపెట్టి పెట్టెలో భద్రపరచాడు. ఆ పెట్టెలో మరో ప్రక్కన ఉన్న గుడ్డసంచీ తీసి, రెండువేలు లెక్కపెట్టి, ఆ సొమ్ము రంగారావు చేతికి ఇచ్చాడు. అతనా డబ్బు లాల్చీ జేబులో పెట్టుకొని లేచి నిలబడి "మరి నాకు సెలవు అవి మీరు స్వేచ్ఛగా మార్చుకోండి, అయితే ఒక్కమాట. అవి దొంగనోట్లు అనుకునేరు. కాదు సుమండి. అది బ్లాక్ మనీ అంటే అనవచ్చు. ఒకప్పుడు ఒక వ్యాపారం చేశాడు నా సన్నిహితమిత్రుడు. నేను అప్పటిలో చేస్తున్న వ్యాపారాలలో, ఒక దానిలో, అతనికి వాటాకూడా ఉన్నది." అతను తనసొంత వ్యాపారంలో, లాభాలు మరీ విపరీతంగా సంపాదించాడు. లక్షలు గడించాడు సినిమాలు తీశాడు. నష్టం వస్తుందేమోనన్న ఆశతో,

కొని, లాభాలు వచ్చాయి. అలా డబ్బు పేరుకొన్నది. అతనికి వాటావున్న వ్యాపారంలోనూ లాభాలు వచ్చాయి. నీ వాటాలాభం నువ్వు తీసుకోమంటే తీసుకోడు. అతను దేనికీ లెక్కవ్రాయతేదు. దాంతోవచ్చింది చిక్కు. ఆ బ్లాక్ మనీ నాద్వారా ఇలా విడుదల చేయిస్తున్నాడు. దీనివల్ల ఆమేరకు నాకూ కొంత రిలీఫ్ వస్తుంది. సర్లెండి ఈ విషయాలు ఎంత వివరించినా మీకు అర్థంకావు. ఆర్థిక శాస్త్రవేత్తకు తప్ప మరొకరికి అర్థంకాదు. ఇంక ఆ విషయం వదిలేయండి. మీతో ఇలా పరిచయం కలిగింది. మీ దర్శనానికి మరో ట్రిప్పులో వచ్చినప్పుడు నాపేరన ఇక్కడమంచి భూములు కొనిపెట్టండి. అయితే మీకు యాభైవేలు మాత్రమే ఇస్తాను. ఆ భూములు లక్షకు కొన్నట్లుగా రికార్డులలో వ్రాయించాలి. సరే. ఆ విషయం అప్పుడు చూచుకొందాం. మరి నాకు సెలవు" అన్నాడు మాటలు అతివేగంగా దొర్లిస్తూ.

రంగారావు సంచీ తీసుకొని నెమ్మదిగా అవతలకు వెళ్ళాడు.

వెంకటరామయ్య గుమ్మంలో, నిలబడి అతను వెళుతున్నవైపే చూస్తూ, ఇతనికేమన్నా కొంచెం వెర్రిఉన్నదా? అనుకొన్నాడు.

అందువల్లనే ఆయన మరో పావుగంట తర్వాత తలుపుకొట్టిన చప్పుడైతే మళ్ళీ ఆ రంగారావే వచ్చాడేమో, తన సొమ్ము తనకు తిరిగి ఇచ్చేయమంటాడేమో అని భయపడ్డాడు. అలా భయపడుతూ కొన్నిక్షణాలు ఆలస్యంచేసి నెమ్మదిగా తలుపు తీశాడు. అయనకు చలపతిరావును చూసేసరికి పట్టరానంత సంతోషం కలిగింది. ఒక్కసారి కొండంత ధైర్యం వచ్చింది. అందుకే ఆయన గబగబా జరిగిన సంగతంతా తన భాగస్వామికి చెప్పుకొన్నాడు.

చలపతిరావు జాగ్రత్తగా విన్నాడు.

తను లేకపోవడంవల్లనే ఈ మోసం జరిగిందని మనసులో అనుకొని, పైకి ఆమాట అంటే బాగుండదని "సరే జరిగిందేదో జరిగింది అవి నన్ను కూడా చూడనివ్వండి అన్నాడు. వెంకటరామయ్య ఒక కట్టతెచ్చి చూపించాడు చలపతిరావు ఆ కట్టలోనుంచి రెండునోట్లు బయటకుదీసి వాటిని ఎంతోసేపు అదేపనిగా, చాలా జాగ్రత్తగా పరీక్షించాడు. చివరకు నెమ్మదిగా మీరు అదృష్టవంతులు. ఇవి మంచినోట్లే. సందేహంలేదు. అయితే ఇది దావుడు సొమ్ముకాదు ఆలా అయితే ఇది ఇలా అమ్ముకోరు ఎవరూ. ఒకవేళ దొంగసొమ్ము అయితే బ్యాంకులో ఇట్టే పట్టేస్తారు. మీరన్నట్లు అతను వెర్రివాడేమోనని నాకూ అనుమానం కలుగుతున్నది. ముందు నేను ఈరెండు నోట్లూ తీసుకొనివెళ్ళి అన్నీ విచారించి వస్తాను. మీరు ఇక్కడే ఉండండి" అన్నాడు.

గంట తర్వాత ఆయన తిరిగివచ్చి ఇవి లక్షణంగా మారలాయి. మరి ఈ వ్యాపారం కూడా కలిసే చేద్దాం. ఇప్పుడు మన ఇద్దరిదగ్గరా కలిపి పదివేలున్నాయి. ఈ మొత్తం ఇచ్చేసి ఇరవైవేలవి తీసుకొందాం. రేపు ఉదయం అవట్ను ఇక్కడి బ్యాంకులో వేద్దాం. బ్యాంకుగుమాస్తాతో ఈ విషయం మాట్లాడివచ్చాను. మనకా వ్యాపారస్తుడు ఇలా సొమ్ము బాకీ ఉన్నాడని, అతను రేపు బాకీ చెల్లిస్తాడని, అది బ్యాంకులో డిపాజిట్ చేస్తామనీ చెప్పాను. మరోపని గూడా చేద్దాం. ఈ కొత్తనోట్ల కట్ట ఒకటి తీసి అవి మన నోట్లతో కలిపి ఇద్దాం. కనుక్కోగలడేమో. కనక్కొంటే ఏమంటాడో చూద్దాం. మరి పదండి ఇంక ఆలస్యం చెయ్యకండి ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు" అన్నాడు.

పది నిముషాల తర్వాత అవసరమైన సొమ్ము సంచీలో పెట్టుకొని వారు ఇద్దరూ మేడపైకి వెళ్లి రంగారావు ఉన్నగది తలుపుకొట్టారు.

వెంకటరామయ్య నిదానంగా బేరంవిషయం బయటపెట్టాడు.

రంగారావు నవ్వుతూకుర్చీలోనుంచి లేచి సలజిడి "అంత సొమ్ము విడుదల కావడం నాకు ఇష్టమే. మీలాంటి పెద్దల దగ్గర సొమ్ము ఉంటే మరెప్పుడైనా నాకు అవసరం వస్తే అప్పుగా అయినా ఇస్తారు. అయితే అంతసొమ్ము ఇక్కడలేదు.

కొత్త వంతెన అవతలివైపున "అప్సర" హోటలులో నా ఫ్రెండ్ గదిలో ఉన్నది. ఇస్తాను. నచ్చితే తీసుకోండి. ఆ తర్వాత మీకు నాయందు స్నేహభావం కలిగితే భూములు కొనుగోలు వ్యవహారంలో కొంచెం సాయం చెయ్యండి. సరే ముందు మరోవిషయంచెప్పాలి. ఆవిడ విషయంలో మీరు పోటీ వస్తె సహించలేను. ఆవిడ ముందు నన్ను ఏమాత్రం కించపరచగూడదు. నా సర్వస్వం అర్పిస్తానంటున్నా నన్ను ఆవిడ వెఱ్ఱివాణ్ణి అంటుంది. అలా అని ఆవిడ ఒక్కర్తే అంటుంది. ప్రేమ గుడ్డిది. వ్యామోహం వెర్రిది. నేనామె వ్యామోహంలో ఉన్నమాట నిజమే మీరు ఇద్దరూ వయసుచేత నాకంటె పెద్దలు కనుక మందలించవచ్చు కాని నన్ను క్షమించండి. అది కేవలం స్వవిషయం. ఆవిడకు నేనంటే అపారమైన అభిమానం. నన్ను విడిచిపెట్టదు. కాని వెఱ్రివాణ్ణి అంటుంది. ఆవిడకు మీరు వంతపాడితే సహించలేను" అన్నాడు.

మరో అయిదు నిముషాల తర్వాత వాను ముగ్గురూ ఆ హోటలుముందు నిలబడ్డారు చలపతిరావు రిక్షాలు పిలిచి బేరమాడాడు. అప్పుడు రంగారావు నెమ్మదిగా "అయ్యా వెంకటరామయ్యగారూ నాదో మనవి. మీరు రిక్షాలో కదా వెడుతున్నది. మీరు పదండి. నేను టాక్సీలో వస్తాను. రిక్షాలో రావడం ఆవిడ చూస్తె బాగుండదు" అన్నాడు. అందుకు వెంకటరామయ్య అబ్బే అదేమిటి అంతా కలిసే పోదాం అన్నాడు. చలపతిరావు ఆయన్ని చేత్తో లాగి "అతను చెప్పినట్టేచేద్దాం. అక్కడమనకు విడిగా కొంచెంపనుంది" అన్నాడు.

వారు ఇద్దరూ రిక్షాలో అప్సర హోటలుకు వెళ్ళారు. అక్కడ చలపతిరావు తనకు పరిచయం ఉన్న వ్యక్తులను పిలుచుకొనివచ్చి బందోబస్తు చేశాడు ఏదైనా ఇబ్బంది వచ్చి పిలిస్తే రమ్మనమనీ, అప్పటిదాకా అక్కడే తనతో ఏమీ సంబంధం లేనివాళ్లలాగా నటిస్తూ జాగ్రత్తగా మసలుకోమనీ వాళ్ళతో చెప్పిఉంచాడు.

రంగారావు అక్కడకు టాక్సీలో హడావిడిగా వచ్చాడు. అతను కారు దిగుతూనే "అయ్యో మీరు ఇక్కడే నిలబడిపోయ్యారేమిటి? అయిదో నెంబరు గది అని చెప్పానుకదా! నేనే ముందు వస్తానుకదా అనుకొన్నాను. కాని సెంటరుకు వెళితేకాని ఈమాత్రం మంచి టాక్సీ దొరకలేదు. సరే పదండి" అన్నాడు వారు ముగ్గురూ ముందుకు నడిచారు

నాలుగుసార్లు తలుపు కొడితేనేగాని గడియ తీయలేదావిడ.

ఆమెను చూచి నిజంగా సినీనటే అనుకొంటూ బిత్తరపోయి అలా చూస్తూ ఉండిపోయాడు వెంకటరామయ్య. ఈమె అందంగానూ ఉన్నది. మంచి తెలివిగల మనిషిలా కనిపిస్తున్నది అనుకొని తల వంచుకొన్నాడు చలపతిరావు. రంగారావు వారిద్దరివంకా చూచి నవ్వుతూ "రండి ఎవరో కాదులేండి. నా స్నేహితురాలు. నాతో స్నేహం కుదిరాక సినిమాలలో వెయ్యటం మానేసింది. ఒప్పుకొంటే పెళ్ళాడేద్దామనుకొంటున్నాను. సరే ఆ సంగతి అలా ఉంచండి ముందు మన పని పూర్తిచేద్దాం". అంటూ గబగబా లోపలకు నడిచాడు.

ఆ గదిలో ఒక పెద్ద సూటుకేసులోనుంచి నోట్లకట్టలుతీసి, లెక్కపెట్టి తీసుకొనివచ్చి వెంకటరామయ్య చేతికి ఇచ్చి "ఇదిగో మీరడిగిన ఇరవై ఇస్తున్నాను. చూచుకొని మీకు ఇష్టమైతే పదే జమ కట్టండి". అన్నాడు. వెంకటరామయ్య చేతిలోనుంచి ఆ కట్టలు తీసుకొని అక్కడ కుర్చీలో

కూర్చొని వాటిని రెక్కబెడుతూ జాగ్రత్తగా పరీక్షించాడు చలపతిరావు. ఆయనకు తృప్తి కలిగింది. ఆ సొమ్ము సంచీలో పెట్టుకొని తను తెచ్చిన పదివేలూ వెంకటరామయ్యకు ఇస్తు "మరి ఆలస్యం దేనికి? ఆ డబ్బు ఇచ్చేసి పదండి" అన్నాడు.

రంగారావు ఆ కట్టలు తీసుకొని అక్కడి బల్లసొరుగులో పడేస్తు "సరేపదండి" అన్నాడు. వెంకటరామయ్య గుమ్మంవైపు నడిచాడు. చలపతిరావు లేచి నిలబడి రంగారావువంక చూస్తు మీరాడబ్బు లెక్కపెట్టుకోలేదు. ఒక్కసారి సరిచూసుకొని సరే అంటే నాకు తృప్తిగా ఉంటుంది. అంటే రంగారావు ఒక కట్ట తీసి ఎడమచేత్తో పట్టుకొని కుడిచేతి వేళ్ళతో ఆ నోట్లు విచ్చుకొనేలా చేస్తు "ఇందులో నావికూడా ఉన్నాయే. పరవాలేదులెండి. ఒకసారి నాదగ్గరనుంచి సొమ్ము విడుదలయితే కనీసం ఆమేరకు లెక్క వ్రాయటం తప్పుతుంది" అన్నాడు.

అప్పటిదాకా ఆ గదిలో ఒక మూల కుర్చీలో కూర్చొని పత్రికలు చూస్తున్నదల్లా చప్పున లేచివచ్చి ఆవిడ "బొంబాయిలో బ్యాంకులో డ్రా చేసిన సొమ్ము ఇలా వ్యర్థం చేస్తున్నారు. అదేమంటే బ్లాక్‌మనీ అంటారు. వ్యాపారం అంటారు. భూములు కొంటున్నామంటారు. గట్టిగా మాట్లాడితే నాకు అర్థశాస్త్రం తెలియదంటారు. మీకు కొంచెం పిచ్చి ఉన్నదేమోనని నాకు మొదటినుంచీ అనుమానంగా ఉంటూవచ్చింది. సరే ముందు వాళ్ళను సాగనంపి రండి. నేను డాక్టర్ని పిలిపించి మాట్లాడి అవసరమైన ఏర్పాట్లు చేస్తాను" అన్నది ఇంగ్లీషులో.

రంగారావు సంజ్ఞచేస్తే వెంకటరామయ్య, చలపతిరావు బయటకు నడిచారు. రంగారావు వారివెంట గేటుదాకా వెళ్ళి "మరి నాకు సెలవు నేను వేరే రానా? మీతో రానా? ఎల్లాగో నేను ఆ బసకు వెళ్ళాలి. రాత్రిళ్ళు ఆవిడ

నన్ను ఇక్కడ ఉండనివ్వదు. ఎవరో డాక్టర్ని పిలవనే పిలుస్తుంది" అన్నాడు.

వెంకటరామయ్య నవ్వుతూ "మాతోనే రండి. మీరు నాకు హామీ ఇచ్చారు. కనీసం మేము బసకు చేరేదాకా తోడు ఉండటం న్యాయం. అన్నాడు చలపతిరావు నవ్వుతూ. మీరు ఇక్కడే ఉండండి మాట్లాడు కొంటూ. నేను టాక్సీ పిలుచుకొని వస్తాను అని గబగబా ముందుకు వెళ్లాడు. మరో అయిదునిముషాల తర్వాత ఆయన ఇద్దరు వ్యక్తులను వెంటబెట్టుకొని వచ్చాడు. వారు అక్కడకు వచ్చిన ఒకటి రెండు నిముషాలలో టాక్సీ వారిముందు ఆగింది. చలపతిరావు తమ వెంట తెచ్చిన ఇద్దరు వ్యక్తులను ముందు కూర్చోమని తను వెనుక సీటులో కూర్చోబోతూ కొంచెం పెద్దగా "రండి రంగారావుగారూ ఇందులో అయిదుగురికి చోటు ఉన్నది. ఒకరికి ఒకరం తోడుగా ఉంటాం. మరి అభ్యంతరం నెప్పకండి" అన్నాడు. ఆయన వెంకటరామయ్య వంకకు తిరిగి రమ్మని సంజ్ఞ చేశాడు.

వెంకటరామయ్య చనువుగా రంగారావు చెయ్యి పుచ్చుకొని "రండి వెళదాం" అన్నాడు. "నన్ను డాక్టరుకి ఒప్పగించరుకదా" అన్నాడు. రంగారావు తలవంచుకొని ముందుకు అడుగువేస్తూ.

చలపతిరావు ముసిముసి నవ్వులు నవ్వుతూ కారులో వెనుక సీటులో మధ్య తను కూర్చుని, ఒక వైపున రంగారావుని మరొకవైపున వెంకటరామయ్యను కూర్చోమన్నాడు.

కారు శరవేగంతో పరుగెత్తింది.

క్రొత్త వంతెన మధ్యకు వచ్చాక ఆ టాక్సీ ఆగింది. ఎదురుగా రోడ్డు మధ్యగా జీపుకారు ఆగి ఉన్నది. కాకీ దుస్తులు వేసుకొన్న ముగ్గురు వ్యక్తులు లాఠీలు ఊపుతూ టాక్సీ ఆపమని సంజ్ఞలు చేసారు. వారి ప్రక్కన

పోలీసు ఆఫీసరు దుస్తులు ధరించిన మరో వ్యక్తి నిలబడి ఉన్నారు. అతని చేతులో పెద్దరకం పిస్టలుఉన్నది. అతను టాక్సీ ఆగగానే వెనుక సీటులో కూర్చున్న ముగ్గురి వైపు పిస్టలు గురి పెట్టి "ఎవరైనా అల్లరి చేశారా కాలుస్తాను. మీరు ముగ్గురు అసలు వాళ్ళన్న మాట. మీరు సవ్యంగా మర్యాదగా లొంగి పొండి. అరెస్టుచేస్తున్నా ఏవైనా దొంగ వేషాలు వేశారా వాళ్ళదగ్గర లాఠీలున్నాయి. నాదగ్గర పిస్టలున్నది కాల్చేస్తాను. తర్వాత దొమ్మీ జరిగిందనీ, కాల్చడం తప్పనిసరి అయిందనీ రిపోర్టు వ్రాస్తాను" అన్నాడు పెద్దగా హుంకరిస్తూ.

వెంకటరామయ్యకు నోటమాటరాలేదు. చలపతిరావు వణుకుతూనే "అసలింతకు ఏమిటండి. మేం ఎవరని అనుకొంటున్నారు. వ్యాపారస్తులం మేం ఎవరో అనుకుని పొరబడుతున్నారు." అన్నాడు నట్టుతూ.

అతను పిస్టలు జేబులో పెట్టుకొని, కారు తలుపు తీసి నవ్వుతూ "ఆ సంగతి నాకు తెలుసు. దొంగ నోట్లతో వ్యాపారం చేస్తున్నారు. మీరు ముగ్గురూ దోషులే. మాకు సమాచారం అందింది. అన్నీ ఋజువు చేస్తాను. అదిగో ఆ సంచీ ఏమిటి అని గబుక్కున చలపతిరావు ఒళ్ళో పెట్టుకొన్న సంచీ, లాక్కుని రెండు కట్టలు బయటకు తీసి. అటూ ఇటూ త్రిప్పిచూచి "ఇంకా సందేహం ఎందుకు ఇవి దొంగనోట్లే" అంటూ అవి మళ్లీ సంచీలో పెట్టేసి, చలపతిరావు ఒళ్ళో పడేట్లుగా విసిరివేసి "ఇంక మాట్లాడకుండా ముగ్గురూ నా వెంట స్టేషన్‌కు పదండి" అన్నాడు, అతను పిస్టలు మళ్లీ చేతిలోకి తీసుకొన్నాడు.

రంగారావు నెమ్మదిగా, హుందాగా కారు దిగి "ఆఫీసరుగారూ ఇంతకూ అభియోగం ఎవరిమీద" అన్నాడు.

"ఈ వ్యాపారం చేస్తున్నవారిమీద"

"అయితే నన్ను పట్టుకోండి. వారు ఇద్దరూ నిర్దోషులు. పెద్ద మనుషులు. వారిని విడిచిపెట్టండి".

అప్పటిదాకా భయంతో వణికిపోతూ తల వంచుకొని కూర్చున్న వెంకటరామయ్య నెమ్మదిగా కారు దిగి "అయ్యా ఇన్‌స్పెక్టరుగారూ రంగారావుగారు చెప్పింది అక్షరాలా నిజం. మా ఇద్దరికి ఇందులో ప్రమేయం లేదు. మమ్మల్ని వెళ్లనీయండి" అన్నాడు.

"సరే అందుకు నాకు అభ్యంతరం లేదు. ఇవ్వండి. ఆ సంచి ఆయనకు ఇవ్వండి. మీ తప్పు ఏమీలేదని తేలితే మీపైద కేసు ఉండదు." అన్నాడు పోలీసు ఆఫీసరు దుస్తులు ధరించిన ఆ వ్యక్తి.

"అదేమీ కుదరదు. ఈ డబ్బు నాది నేను ఇవ్వను" అన్నాడు చలపతిరావు ధైర్యంగా.

"అయితే మీరూ పదండి స్టేషనుకు. అక్కడ తేలుద్దాం ఈ దొంగ నోట్లు ఎవరివో ఏమిటో...."

"ఇవి దొంగనోట్లు కాదు."

"కాకపోతే సగం ధర ఇచ్చి ఎందుకు కొన్నారూ?"

"ఆ మాట ఎవరన్నారు?"

"అవన్నీ తర్వాత స్టేషన్‌లో వివరంగాచెబుతాను మీచేతచెప్పిస్తాను. మాకు అందిన సమాచారాన్ని బట్టి ఇవి దొంగనోట్లు కావాలి. చాలా పకడ్‌బందీగా అచ్చువేశారెవరో. కాకపోతే ఇంతమంది దగా పడరు. ఒకవేళ అవి మంచివే అయినపక్షంలో రంగారావన్న లక్షాధికారి వెర్రివాడు కావాలి. అతను వెర్రివాడని ఋజువైతే అతన్ని మోసగించి డబ్బు కాజేశారని మిమ్మల్నిద్దర్ని బుక్ చేస్తాను" అన్నాడు పోలీసు ఆఫీసరు దుసులలో ఉన్న వ్యక్తి. పోలీసు దుస్తులు ధరించిన మిగతావారు కారుకు మూడు వైపులా లాఠీలు ఎత్తి నిలబడ్డారు.

చలపతిరావు మాట్లాడకుండాటాక్సీ దిగి రంగారావుదగ్గరకు వెళ్ళి "సరే ఇక లాభంలేదు ఇదిగో ఈ కాగితంపైన మా సరుకు మాకు వాపస్ చెయ్యమని వ్రాసి ఇవ్వండి. ఆమెకు కొంచెం వివరంగా వ్రాయండి" అన్నాడు.

రంగారావు వెంటనే ఆయన కోరినప్రకారం వ్రాసి ఇచ్చాడు. చలపతిరావు ఆ చీటీ చదువుకొని తృప్తిపడి చేతిలోని డబ్బుసంచీ రంగారావు చేతికి ఇచ్చి మేం ఆవిడదగ్గరే ఉంటాం. మీరు వాళ్ళకు సర్దిచెప్పి రండి" అన్నాడు నెమ్మదిగా. అందుకు రంగారావు అంతకంటె నెమ్మదిగా "అయితే ఇదంతా మీపని అన్నమాట అందుకే ఎవరో క్రొత్తవాళ్లను వెంటతీసుకొని వచ్చారు ఇంతగొడవ జరుగుతుంటే వాళ్లుకానీ, టాక్సీ డ్రైవరుకాని ఒక్క మాట మాట్లాడలేదు. నా స్నేహితురాలిని కూడా నెమ్మదిగా మీవైపుకు త్రిప్పుకొన్నారన్నమాట మీకిది న్యాయమేనా? నాకంటె ముందు వచ్చి ఒక్క పది నిమిషాలలో ఎంత గొప్ప ఏర్పాటు చేశారు" అన్నాడు.

అంతలో పోలీసు ఆఫీసరు దుస్తులు వేసుకున్న వ్యక్తి ముందుకు వచ్చి "ఏమిటి గుసగుసలాడుతున్నారు. నా సంగతి మీరెరుగరు పదండి" అన్నాడు కోపంగా. కాకీదుస్తులు వేసుకున్న వ్యక్తులు ముందుకు వచ్చి రంగారావు వెనుక నిలబడ్డారు.

చలపతిరావు టాక్సీ వెనక్కు పోనిమ్మన్నాడు. ముందు కూర్చున్న వాళ్లనూ, ప్రక్కన కూర్చున్న వెంకటరామయ్యనూ అప్సర హోటలుకు వెళ్ళేదాకా మాట్లాడవద్దన్నాడు. వారంతా చూస్తుండగా రంగారావు తల వంచుకొని ముందుకు నడచివెళ్ళి నెమ్మదిగా జీపులో ఎక్కాడు.

టాక్సీ "అప్సర" వైపుకు దూసుకొని పోయింది.

మరో పావుగంట తర్వాత ఆ టాక్సీ అదారినే అంతవేగంగానూ దూసుకొనివచ్చింది. వారు అప్సర హోటలులో, అయిదవ నెంబరు గదికి

వెళ్ళి చూస్తే ఖాళీగా ఉన్నది. హోటలు మేనేజరును అడిగితే ఆవిడ ఆ గది ఖాళీచేసి వెళ్ళి చాలా సేపయిందని చెప్పాడు.

చలపతిరావు వెంకటరామయ్యను వెంట పెట్టుకొని తాము బసచేసిన హోటలుకు తిరిగివచ్చి రంగారావు దిగిన గదికి పోయి చూస్తే అదీ ఖాళీగా ఉన్నది.

చలపతిరావుకు కోపం వచ్చింది.

ఆయనకు రోషం వచ్చింది.

ఆయన గబగబా ఆ హోటలు మేనేజరు దగ్గరకు పోయి ఆయనతో తగూలాడాడు. కోపంగా పెద్దగా "ఆ గదిలో దిగిన రంగారావు మాతో మాటమాత్రం చెప్పకుండా నిముషంలో ఖాళీ చేశాడు అతను ఎక్కడకు పారిపోయాడు. అతని సామాను ఏమైంది" అంటూ ఘర్షణకు దిగాడాయన ఆ హోటలు మేనేజరు "అయ్యా! మీరు పెద్దమనుష్యులు. అనవసరంగా తగూలాడకండి. నిదానంగా ఆలోచించండి ఆయన తీసుకొన్న గది ఆయన ఖాళీచేసి పోయాడు. మీకు చెప్పి పోవలసిన అవసరం ఉందేమో నాకు తెలియదు. అద్దె చెల్లించే వెళ్ళాడాయన. ఆయనకూడా మీలాగే మాతో మర్యాదగానే ఉన్నాడు. ఆయనమీద ఎవరూ ఫిర్యాదు చేయలేదు. మీకు ఏదైనా అన్యాయం జరిగివుంటే పోలీసులకు రిపోర్టు ఇవ్వండి" అన్నాడు.

వెంకటరామయ్య వద్దంటున్నా చలపతిరావు పోలీస్ స్టేషన్‌కు ఫోనుచేసి క్రొత్త వంతెనమీద జరిగిన సంఘటన గురించి క్లుప్తంగా చెప్పి చివరకు "అయ్యా వారు ముగ్గురూ మీ శాఖవాళ్ళు. ఇంతకూ ఆ రంగారావు మీ దగ్గరే ఉన్నాడా? అని అడిగాడు. స్టేషనునుంచి ఇన్‌స్పెక్టర్ తనకు అటువంటి సమాచారం ఏమీ అందలేదని వంతెనమీద ఎవరినీ స్వాధీనంలోకి తీసుకోలేదని అనుమానించవలసిన వ్యక్తులుంటే స్వయంగా వచ్చి రిపోర్టు ఇమ్మనీ, తాను రిపోర్టు అందగానే దర్యాప్తు ప్రారంభిస్తాననీ అన్నాడు.

చలపతిరావు ఫోను పెట్టేశాడు.

వెంకటరామయ్య ఆయన్ని చెయ్యిపుచ్చుకొని గదిలోకి లాక్కొని వెళ్ళాడు. గదిలో అడుగుపెడుతూ చలపతిరావు ఆ రంగారావు పెద్ద ప్లానే వేశాడు. ఆ పదివేలూ కాజేసి తన ముఠాతో కలిసి పారిపోయ్యాడు. అంటూ పళ్ళు కొరికాడు.

వెంకటరామయ్య తాపీగా నవ్వుతూ "కోపం పనికిరాదు. ఇంకా నయం ఆ కోపంలో, ఫోన్లో, మనపేర్లుకూడా చెప్పేస్తారని భయపడ్డాను. పోయిన సొమ్ము పోగా కేసులో ఇరుక్కొనేవాళ్ళం. కాని మీరన్నట్లు ఆ రంగారావు తీసుకొనిపోయింది పదివేలుకాదు. ముప్పైవేలు. మనసొమ్ము పదివేలు. ఆ బ్లాక్ మనీ-లేక-దొంగనోట్లు-లేక దొంగనోట్లని మనం అనుకొన్నది-ఇరవై వేలు అంతాతీసుకొని ఉడాయించాడు మనకు నష్టం సుమారు ఇరవై వేలు" అన్నాడు. "కాదు. పదివేలే. అది చెరో ఐదువేలే" అన్నాడు చలపతిరావు.

"కాదు మనది మొదట పదివేలు. అది ఇరవైవేలయింది. అలా అయిన తర్వాత ఆ మొత్తం ఇరవైవేలూ పోయ్యాయి. మనకు ఇద్దరకూ కలిపి నష్టం ఇరవై వేలంటాను. అది ఉమ్మడి వ్యాపారానికి సంబంధించిన వ్యవహారం, కాగా మీరు చెప్పిన లెక్క ప్రకారం నా వాటాక్రింద వచ్చిన నష్టంకూడా అయిదువేలు కాదు. మూడువేలు మాత్రమే. నేను విడిగా చేసిన వ్యాపారంలో నాకు రెండువేలు లాభించాయి అందువల్ల అది నష్టంలో తీసెయ్యాలి. ఆర్థికశాస్త్రం క్షుణ్ణంగా తెలిస్తేనేకాని ఈవిషయాలు అర్థంకావు" అన్నాడు వెంకటరామయ్య.

"సరేసరే ఇంక ఊరుకోండి శాస్త్రవివరణ. సొమ్ము పోయిందని ఒకవంక నేను బాధపడుతుంటే మీరు ఏదో చర్చలోకి దిగారు. అని గొణుగుతూ చలపతిరావు దిగులుగా చూస్తూ ఉండిపోయాడు.

---